
# ఎక్స్పర్ట్లంటే మాటలా!



ఏమివాయ్ వెంకటేశం. ఎక్కడికి చెంగు చెంగున లేడి పిల్లలా గెంతులు వేస్తూ బయల్దేరావు?....వాట్!పిక్చరుకా? దేనికి? టెంటు సినిమాకా. అంటే టెలుగు పిక్చరనేగా నీ తాత్పర్యం. మనవూరు టెంటుసినిమాలో టెలుగు పిక్చర్సు కాక మరేవి(టాడుతాయిలే.

హరి నీ యిల్లు బంగారంగానూ, నీకు బ్యూటిపుల్ యంగ్ విడోతో మారియేజ్ కానూ, ఎంత ఒఘయిత్యాని కొడిగట్టావు. కాస్తలో ఎంత ప్రమాదం జరిగేది. గిరీశ(వంతవాడి

శిష్యుడవై తెలుగు పిక్చరు--అదీ డబ్బు ఖర్చుపెట్టి చూస్తావటోయ్. ఇన్సల్ట్. అసలు తెలుగు పిక్చర్లెందుకూ? మన అధోగతిని పట్టుకు తిట్టిపోసుగోడానిగ్గాపోతే. మనం కూడా డబ్బు పెడితే ఈ పిక్చర్లు ఇహ నీ జన్మకి బాగుపడవు. అదిన్నీగాక, మదరిల్లా ఆశపడుతున్నట్లు ఆవిడ మాటచలవని నువ్వు రేపొద్దున్న పరీక్ష యిచ్చి ఏ కనిష్టీవువో, సర్కిలువో అయితే ఊరికినే చూడొచ్చు. అదృష్టం నీకూ నాకూ జాస్తిగా ఉండి, నాకు బ్రదరిల్లావే అయే యోగం పడితే ఇహ చెప్పాలా. అప్పుడు నేనెలాగా లీడింగ్ ప్రొడ్యూసరు డైరెక్టరాక్టరు నౌతాను గదా.

అప్పుడు--

--వింటున్నారా వదినా! అప్పుడు మీరూ నేనూ మన ప్రయివేటు ఆడిటోరియంలో కూర్చుంటాం. అంటే మన సొంత సినిమా హాలన్నమాట. కేవలం మనకోసవేఁ పిక్చరాడు కుంటావన్నమాట. మన వెనకే ప్రొజెక్టరు. మన వెంకటేశవేఁ దాన్ని ఆపరేట్ చేస్తాడు.... ఔనా. వెళ్లిరండి. పోపు మాడిపోతే అనక మీనాన్న వెంకటేశం మాడూడకొడతాడు మజ్జన--

ఊ. ఏవిటోయ్ వెంకటేశం. అయితే సినిమా కెళ్తానంటావు. నా మాట విని ఆ డబ్బులా తగలెయ్యక ఇలా తగలెయ్యి. సిగార్సుకి కాపర్సు అవసరమవుతాయి. వాటికి తగలేద్దాం. చూశావూ ఆ తగలేసేది కూడా సరైన పద్ధతిలో తగలెయ్యాలి. ఇలా కూచో చెబుతా. నువ్వైతే మహ సినిమా చూడాలని ఎగబడుతున్నావుగాని ఆ తీసే వాళ్లకి ఏఁవి బేహద్బీగా ఉందో తెలుసా? నువ్వూ నేనూ అసలు సినిమాలు చూసిందికి పనికిరావుట. మనఁవిచ్చే డబ్బులు వాళ్ల కసలు కలికంలోకి రావుష, మనం క్లాసు వాళ్లంట. మనకి ఆ యోగ్యతా లేదుష మరి.

ఏ మాట కా మాటే అనుకోవాలి, ఆ మాటా నిజవేఁ.. మర్నేనూ రేప్పొద్దుట్నుంచి ప్రొడ్యూసర్ డైరెక్టర్నవుతున్నాను గదా!

సినిమా చూసే అర్హత నీ కుందా అని. కలికాలం గా కపోతే పెతీవాడూ సినిమా చూస్తాననని ఎగబట్టవేనా?

చూడొచ్చింది చాలక అడ్డుప్రశ్నలొహటా. డు యు నో వెంకటేశం? మీ అడియన్సు సగటు వయస్సు పన్నెండేళ్లనీ, బుర్ర అంతకు మించి ఎదగలేదనీనూ. పాతికేళ్లనించీ అదంతేనని మేవంతా నమ్ముతుంటే, ఇవాల్టిరోజున-- మీరు కాదు-- వయస్సు పెరిగిందంటే చెల్లుతుందా? చెప్పు. చెల్లదు. ఔనా? అలాంటప్పుడు పెద్దంత్రం, చిన్నంత్రం లేకుండా మీరు--మీప్రజలు--మమ్మల్ని విమర్శిస్తే ఎలా?

ఈమధ్య ప్రతివాడూ మన పిక్చర్లలో వాగుడెక్కువై పోయిందంటున్నారు. డైలాగులన్నీ ఉపన్యాసాలలా ఉండటవే(కాక,అవి చాల వన్నట్టు మళ్లీ పిక్చరు చివర "ఫలానా రావు మెమోరియల్ లెక్చర్" అన్నట్టుగా నికార్సైన లెక్చర్లు ఏర్పాటు చేసేస్తున్నారనిన్నీ--కన్నాంబ లేకపోతే హీరోయినో ఎవరో ఒకళ్లు పుంజుకుని చెవులు హోరెత్తించేస్తున్నారనీ--విమర్శిస్తున్నారు. బట్ వాడ్డు యు నో! ఆ లెక్చర్లే తమిళంలో అక్షర లక్షలు రూపాయలు కురిపించాయి. వాటికోసం జనం విరగబడి చూశారు. మజాకా అనుకున్నావా లెక్చరంటే.

ముందర డబ్బింగు సినిమాల ద్వారా శాంపుల్ చూసి మీకు నచ్చాయని పసిగట్టి కదా ఇపుడు ధారాళంగా ఏర్పాటు చేస్తున్నాం. పైపెచ్చు సినిమా అంతా ఐపోయినా కథలో పాయింటేమిటో పట్టుకోలేనివాళ్లు కొన్ని లక్షల మందుంటారు. లెక్చర్లద్వారా వారికి కథను జ్ఞాపకంచేసి అబ్బీ నువ్వు దీనిద్వారా గ్రహించిన నీతి ఇదిస్మీ అని ఢంకా బజాయించినట్టు చెప్పిందికి సదుపాయంగా ఉంటుంది.

* * * *

పొడుగు డైలాగులేనా అంతే, రెడ్డొచ్చెనని మొదలాడడం సినిమాలో సాధ్యపడ్డం లేదు గదా! అంచేత అలా ఆలీసెంగా వచ్చేవాళ్ళు మళ్ళీ జరిగిన కథ చెప్పమని పక్కవాళ్ళ ప్రాణాలు తోడీకుండా మేమే పావుగంటకోసారి జరిగిన కథ టూకీగా డైలాగులో చెప్పిస్తున్నాం. ఇది మీ ప్రజల మేలు కోరే. అంతేకాని మీలో కొందరు గిట్టనివాళ్ళు ఆడిపోసుకుంటున్నట్టు ఇంటర్వెల్‌దాకా పాత్రలనీ కథనీ ఎస్టాబ్లిష్ చెయ్యడం చేతకాక కాదు. చాతకాకపోయినా మీరు ఇలా మంచి భావంతోనే ఎందుకు అపార్థం చేసుకోరాదూ?

అదిగో ఆ పొడుగోటి, ప్రతి అడ్డమైనవాడూ టెలుగు పిక్చర్లు పొడుగోయ్! అని ఆడిపోసుగోడవే. అలా అని అనే చివరికి దిష్టి తగిలి ఆ పొడుగూ చిక్కి సగమైపోయింది. పూర్వం పాతిక ముప్పై వేలుండే ఫిలుములన్నీ పదిహేనిరవై వేలకి తగ్గిపోయాయి. అయినా ఆ మురార్జీ దేశాయి వారికింకా ఇందుమీదే దృష్టి. ఫిలిమ్మీద పన్నేస్తే పొడుగు తగ్గుతుందనీ, అది తగ్గితే ఇహ ప్రెసిడెంట్ ఎవార్డు విన్నర్ క్లాసిక్సు కుప్ప తిప్పలుగా వస్తాయనీ ఆయన దురాశ.

ముతక సామెత జెప్పినట్టుంది. ఒక దేవత నెత్తిన కాలెట్టిన నాస్తికుడి నేవసలేక భక్తుడిని భయపెట్టిందట. వాడికి భయం జెప్పి ఆ కాలు తీయించి తగిలేస్తావా లేదా అని. అలా వుంది మురార్జీగారి పథకం.

ఒకటి చెబుతావిను వెంకటేశం. పొడుగు తగ్గిస్తే సినిమాలు బాగుపడతా యనుకోవడం వుట్టి భ్రమ. అయ్యో వున్నదే పదివేల అడుగులని డబ్బు రావడానికి మరి నాలుగు డాన్సులు, రెండర్థాల మాటలు పెట్టేసి జాగర్త పడతారు తెలివైనవాళ్ళంతా. మళ్ళీ ఆనక సెన్సారువాళ్ళ మూలంగా కత్తెర్లకి డిమాండు పెరగడం, వాటిమీద ఇంపోర్టు కంట్రోళ్ళూ, రోకళ్ళూ దానికి ఉద్యమాలూ గట్రా వస్తాయి. ఎందుకొచ్చిన రభస....

